

# ఇ. మైత్రేయస స్వగతం

ఇదికొత్తేమీ కాదు. ఇలాంటి సమస్యలు చాలామందికి అదివరకు వచ్చినవే. అనేకమంది అనేక రకాలుగా పరిష్కారం చేశారు. నావరకు నేను నా నవలల్లో ఇలాంటివాటిని రకరకాలుగా చిత్రించాను. నేను రాసే తీరులో వుందో ఆ సమస్యల్లోనే వుందో తెలీదుగాని పాఠకులు మాత్రం నా నవలలను బాగా హర్షించారు. నేను ఏ కేరెక్టరుకు కూడా అన్యాయం చెయ్యలేదనే ఆత్మవిశ్వాసం బాగా నాటుకుపోయింది.

కాని ఈనాడు నాకు నేనే అన్యాయం చేసుకుంటున్నానా అనే భయం కలుగుతోంది. నాకు ఎదురైన సమస్యను నేను

ఎన్నివిధాల ఆలోచించినా పరిష్కారం చేసుకోలేక పోతున్నాను. రచయిత్రిని అనే అహం బాగా దెబ్బతిన్నదనే చెప్పాలి.

నా మిసెస్ నవలలు, కథలు రాస్తుందని, ఫలానా పత్రికలో ఫలానా నవల రాసిందని ఆయన నన్ను పరిచయం చేస్తున్నప్పుడు నేను గర్వపడిన మాట నిజమే. ఆయనకు నా మీదవున్న గౌరవము, అభిమానము చూస్తుంటే నా సంతోషానికి, ఆనందానికి హద్దులేని మాట నిజమే. భార్యా భర్తలు యిద్దరూ సమానమే.భర్తను భార్య గౌరవించినట్లే భార్యనుకూడ భర్త అభిమానంగా చూడాల్సిందే అని నిక్కచ్చిగా వాదించేవాళ్లల్లో ఆయనొకరు. ఆయన స్వతహాగా మంచివారు, అయితే ఇప్పుడు చెడిపోయిందీ లేదు. మనస్సు ఊగుతూ వుంటుంది. అట్లాగే నా మనస్సూనూ.అందుకనే భేదాభిప్రాయాలు తప్పక కలుగుతాయి. అంత మాత్రంచేత ఇద్దరూ విడిపోనక్కర్లేదు. ఆయన ఉద్దేశమూ అదికాదు. నా అభిప్రాయం అంతకంటేకాదు. కాని ఒకే ఇంట్లో వుండలేక పోతున్నామే. దీనికి కారణం నే నెంతవరకు అని తీవ్రంగా ఆలోచిస్తున్నకొద్దీ ఆయనే కారణం అని స్పష్టంగా అనిపిస్తూ వుంటుంది. బహుశా ఆయనకూడా ఈ విధంగానే ఆలోచించుకుంటూ వుండొచ్చుగదా. అప్పుడు నేనే కారణం అని ఆయనకూ తోచొచ్చు. అందుకనే ఇంత మధన, ఇంత ఆవేదన, తాపత్రయమూను.

నిజానికి ఆ లీలావతెవరో నాకు ముందుగా తెలీదు. ప్రమాణంచేసి చెప్పమంటే చెప్పుతాను. తెలిస్తే నా ఇంట్లోకి రానిస్తానా? ఏ ఆడదయినా తన గుండెల మీద కుంపటి పెట్టుకుంటుందా! ఆ మాటకొస్తే యెవ్వరూ పెట్టుకోరు. నేను అంతకంటేను. అయితే పాపం లీలావతి తప్పేమీలేదు. అమ్మగారు, అమ్మగారు అంటూ యెంత చనువుగా వుండేది. యెంత ఆప్యాయంగా వుండేది. ఆమెను లేనితనం నా ఇంట్లోకి తీసుకొచ్చి పడేసింది. లేకపోతే మొగుణ్ణీ, పిల్లల్నీ వదిలి పెట్టేసి మా ఇంట్లోకి వంట మనిషిగా యెందుకు చేరుతుంది. మా విషయం మేము చెప్పకోకూడదుగాని పుష్కళంగా డబ్బిస్తాం, తిండి పెడతాం, కట్టుకునేందుకు చీరెలు ఇచ్చాము. ఇహ ఇక్కడ వుండక యేంచేస్తుంది. కొత్తలో ఆయన యెదుట పడటానికి బిడియపడేది. బెరుగ్గా వుండేది. ఆయనకూడ అంతకంటేను. అది నటన అని నే ననను. ఇద్దరికీ కూడా ఒకర్నొకరు చూస్తే భయం, భీతి కలిగేవేమోమరి.

ఏమైనాగాని ఆయనకు ప్రమోషను వచ్చినప్పుడు అంత హంగామా చెయ్యాల్సిన పనేమీలేదు. నేను చెప్పి చూశాను కూడా. ఆయన వినలేదు. నేనూ పట్టు పట్టలేదు.నాలో ఎడ్జెస్టయ్యే గుణం చాలా

వుంది. అది నాకు బాగా తెలుసు. కాని ఆయన ఒప్పుకోరు. నేను దేనికీ ఎడ్జెస్ట్ కాలేనని, ఒట్టి సెంటిమెంటల్‌గా వుంటా నని దెప్పిపొడుపు. అది నిజం కాదు. ఆ విమర్శకు నేను ఒప్పుకోను. భారీ యెత్తున ఖరీదుగల చీరెలు కట్టుకుని వెక వెకలు, పకపకలు, అయినదానికీ కాని దానికీ విరగబడి నవ్వటం అంటే నాకు చెడ్డ అసహ్యం. వళ్లుమంటకూడ. అదేం దురదృష్టమో ఆ నాడు వచ్చిన వాళ్ళం దరూ అలాంటి బాపతే. ఆ నాడు నేను కూడా వాళ్ళతో తైతక్క లాడలేదని ఆయనకు నా మీద కంఠంవరకూవుంది. అది సభ్యతని నేను అనుకోను. కేవలం ఆయన్ను సంతోషపెట్టటానికి ఆ పని నేను చేసివుండాల్సిందే! నేను చెయ్య లేకపోయాను. ఇది ఎడ్జెస్ట్ కాలేకపోవటం అంటే నేను ఒప్పుకోను. అయినా నే నెవర్నీ ఇన్‌సల్ట్ చెయ్యలేదే. చెప్పాలంటే ఇలాంటివి చాలావున్నాయి తెల్లారి లేస్తే కీచులాడటానికి కారణాలు యెన్ని ఉంటాయోసంతోషంగాసర్దుకు పోవటానికీ అన్ని అవకాశాలుంటాయి. ఎవరి మన స్తత్వం ప్రకారం వాళ్లు ప్రవర్తిస్తారు. దాంట్లో తప్పొప్పులు, పాపపుణ్యాలు యెంచక్కరలేదు. పాపం అనేది భౌగో ళికం అన్నాడు బెర్ట్రండ్‌రసెల్ పోనీండి అందాక యెందుకు, పూర్వజన్మ సంస్కారం అంటారు ఆయన. అసలు ఆ సమాసమే నాకు పడదు. ఆ భావాన్నే అంతకంటే నాజూగ్గా చెప్పొచ్చు. ఆయన చెప్పగలరు కూడా. కాని చెప్పరు నాకు ఇష్టం లేదని తెలిసింతర్వాత మరీ పట్టుదల యెక్కువవుతుంది ఆయనకు.

రామనాథంగారు పెద్ద కంపెనీకి మేనేజింగు డైరెక్టరు కావచ్చు. ఆయన భార్య లలితను మేనేజింగు డైరెక్టరు గారి భార్య అని నలుగురూ గౌరవించవచ్చు. ఆమెతో నాకేం సంబంధం అంట! ఆమెను నా వ్యక్తిత్వం చంపుకుని గౌరవించా ల్సిన అవసరం నాకేంలేదు. ఆయన కూడా ఆఫీసులో మేనేజింగు డైరెక్టరుకు అడుగులకు మడుగులు వత్తాలంటే తప్ప దేమో తెలీదుగాని ఆయనగారి భార్యకు కూడా యెందుకు? ఇదికూడ నాకు అర్థం గాని విషయాల్లో ఒకటి. అసలు అచ్చంగా ఇలాంటి సిట్యుయేషన్ నా నవల్లోకూడా ఒకసారి వచ్చింది. అప్పుడు నేను నిస్స హాయురాలిగా కూర్చోలేదు. ఆయన గార్ని అదుపులో పెట్టేసి భార్యచేత ముక్కచీవాట్లు పెట్టించా. దాంతో చప్ప బడిపోయాడు. అది నవల, ఇది నా జీవితం. అక్కడ యెవరో మగాయన, ఇక్కడేమో నా మొ......! ఇంత తేడా వుంది. అందుకనే మెదలకుండా వూరు కుంటున్నా. ఇలాంటివి వచ్చినప్పుడు నాలో నేను సమాధానపడుతూ వుంటా! బహుశా నా సహనాన్ని పరీక్ష చెయ్య టానికి ఇవన్నీ చేస్తూ వుంటారేమోనని ఏ రకంగా సమాధానపడ్డా కూడా నా మనస్సుకు తృప్తి కలగటం లేదు.

ఇదంతా కూడా యీ మధ్యలోనే. పెళ్ళయిన కొత్తల్లో ఏ పొరపులూ లేవు. అసలు ఆ ఉద్రేకంలో యేమీ వుండవేమో కూడా. ఆయన లీలావతితో అంత చనువుగా మాట్లాడడానికి కారణం కొంత వరకు నేను అని యెవరేనా అంటే ఒప్పుకుంటాను. ఒకే ఇంట్లో వుంటూ యెబ్బెట్టుగాను యెడం, యెడంగాను వుంటుంటే నాకేం తోచదు. మాటా పలుకూ లేకుండా యేమిటా బిడియం. అసలు ఆడా మగా మాట్లాడుకున్నంత మాత్రాన పెడర్థాలు కల్పించే మన స్తత్వం నాదికాదు. చాలా మంది ఆడవాళ్ళలో ఇలాంటి రకమే వుంటారని మగవాళ్ళంటారు. ఆ మాట నేను నమ్మను. అసూయ అనేది ఆడవాళ్ళ సొత్తేకాదు. అది అందర్లోనూ వుంటుంది. అయితే నాలో లేదూ అది. నేను గొప్ప అని చెప్పుకోవటంలేదు. నిజంగా నాలో అసూయ అనేది లేదు. మీరు నమ్మకపోతే మీ ఇష్టం కాని నాకు అర్థం కావటంలేదు. లీలావతి ఒక్కక్షణం మా ఇంట్లో ఉంటానికి వీల్లేదు. ఇహ ఉంటే యెంత గొడవ అవాలో అంత గొడవ అయితీరుతుంది. ఎట్లా యింట్లోంచి వెళ్ళిపొమ్మనటం? ఇదొక పెద్ద సమస్యగా తయారయింది. సూటిగా చెప్పటానికి నేను జంకుతున్నాను. ఆయనతో యే విధంగా చెప్పాలో అసలు అర్థంకావటంలేదు. నా మనస్సు ఆయనకు తెలియచేయటానికి యెన్ని విధాల ప్రయత్నం చేసినా అర్థంకానట్లే ప్రవర్తిస్తున్నారు. నిజంగా అర్థం కావటం లేదో నటనో నాకే తెలీటంలేదు. ఆ వంట మనిషి లీలావతిమీద మోజు, ప్రేమ వుంటుందని నేను అనుకుంటే ఆయన మంచితనాన్ని నేను శంకించినట్టే అవుతుంది. ఆయన చాలామంది మగవాళ్ళకంటే గొప్పవారు. అది నాకు తెలుసు. అయితే నాకు తెలిసినదానికి జరుగుతున్నదానికి పోలిక లేకుండా పోతోంది

రామనాథంగారి భార్య అంత హఠాత్తుగా మా యింటికి రావాల్సిన పనేమీ లేదు. మా వార్ని కలుసుకోవాల్సిన అవసరం అంతకంటే యేమీలేదు. మరి యే ఉద్దేశంతో వచ్చిందో నాకయితే తెలీదు. ఆ కారులోంచి దిగుతూండేనే నాకు వంట్లోంచి హడలు పుట్టుకొచ్చింది. ఆ డోర్‌ను గభాలున కొట్టేసింది. డ్రైవరే నివ్వెరపోయాడు. నాకూ ఆశ్చర్యం వేసింది. ఆ సమయంలో ఆయన ఇంట్లో లేరు. ఇంట్లోనే వుంటే యేం రాద్ధాంతం అయ్యేదో యేమో! యెన్నెన్ని మాటలు అందీ! యెంత గొడవ చేసిందీ. అసలు నన్ను నోరు తెరువనిస్తేగా! ఇంతకీ అసలు విషయమేమిటంటే ఆయనగారు రామనాథం గారితో యే మే మి టో చెప్పాడట తనమీద. ఆ లలితగారి మీద నేరాలు చెప్పాల్సిన అవసరం యీయనకేమిటో నాకు అంతు పట్టటంలేదు. ఇంట్లో గొడవగాక ఆఫీసులో కూడా ఉందన్నమాట.




తెలుసుకుంటే నవ్వొస్తుంది. నేను మొట్టమొదట్లో నవలలు రాసే రోజుల్లో ఇలాంటి సంఘటనలే వచ్చాయి. అప్పుడు ఆ వంటమనిషిమీద దొంగతనం మోపి ఆ యింట్లోంచి వెళ్ళగొట్టించి ఆ కాపరం నిలబెట్టించా. తర్వాత నేను చేసిన పనికి నేనే పశ్చాత్తాప పడ్డాను. ఒక నిర్దోషి మీద నేరం మోపినందుకు నేను చాలా బాధపడ్డాను. నవలలో రాసినందుకే అంత యిదయ్యానే అలాంటప్పుడు నిజంగా యివ్వాళ లీలావతిమీద దొంగతనం కట్టగలనా! ఏమయినా సరే గాని అంత నీచస్థితికి దిగజారలేను. లీలావతి చాలా ఉత్తమురాలు. పాపం అమాయకురాలు కూడా. పొట్టకోసం యిక్కడికి వచ్చిపడింది. ఇంకా ఎన్నాళ్ళో ఉండదు. ఆమె అంతట ఆమే వెళ్ళిపోతుంది.ఆమె వెళ్ళిపోయేలోగా నా రోజులు తిన్నగా వెళ్ళిపోవద్దూ. అందుకని ... అందుకని యేమిటి ?...

మనం యెన్నో రహస్యాలు అనుకుని భద్రంగా దాచుకుంటుంటే, మనింట్లో పనిమనుషులకు, డ్రైవర్లకూ అన్నీ తెలిసిపోతూంటాయి. మన పనిమనిషి వెళ్ళి పక్కింటావిడతో చెవిలో చెపితే ఆమె కాస్తా వెళ్ళి ఆమె భర్తకు ఇచ్చేస్తుంది. యీ రహస్యం దాచెయ్యమని ఆయనగారు కాస్త క్లబ్బులోకి వెళ్ళి ఆయన స్నేహితుడికి చెపితే ఆ స్నేహితుడు కాస్త యింటికొచ్చి భార్య వీనులకు విందు చేస్తాడు. ఆమెగారు వూరుకోకుండా ఏ పనిమనిషిని విశ్వాసపాత్రురాలుగా,సన్నిహితురాలుగా చేరదీస్తుందీ. ఇహ సర్కిల్ కాస్త పూర్తి అవుతుంది. ఇలాంటిదే ఒకటి తటస్థించింది నాకు. రహస్యాలంటూ యిన్నాళ్ల దాపరికంగా వున్నవన్నీ యిట్టే బైటపడుతున్నాయి.

ఆ లీలావతి అప్పుడెప్పుడో పెళ్ళిచూపులు చూసుకునే రోజుల్లో మా ఆయన్ను వద్దన్నదిట.నల్లగా వున్నాడని.

ఆయన నలుపే. ఆమె యెరుపే. రెండూ నిజమే. మనిషి రంగునుబట్టి మనస్సును వూహించుకునే అవివేకిని కాను. నిజానికి నేను ఎరుపే అయితే ఏమిటి ? కాని ఆయనకు కసి, కోపం, ద్వేషం అన్నీ వున్నాయి. నేననుకున్న ప్రేమ, అభిమానం ఆ లీలావతి మీద లేవుట. బ్రతికి పోయినాం. అయితే ఆయన ఆమెమీద ప్రతీకారం తీర్చుకోవాలని గట్టి పట్టుదలతో వున్నాడుట. ఎట్లా ప్రతీకారం తీర్చుకుంటారు. ఒక మగవాడు ఒక ఆడదానిమీద ప్రతీకారం తీర్చుకునే పద్ధతే ఆయన మనస్సులోనూ వుందా అనే అనుమానానికి ఇప్పుడేమీ ఆస్కారంలేదు. ఆయనకు అలాంటి దురుద్దేశం వుండదని నా కెప్పుడో తెలుసు. కాని మధ్యలో మనస్సాగక ఇంకోసమాధానం తోచక, నిజం తెలియక తికమక పడ్డ మాటవుతే వాస్తవమే. అది ఆయన దోషంకాదు. అది నా అవివేకం. ఇంతటితో ఇదాగలేదు. ఇంతకంటే దారుణంగా పరిణమించింది.

ఆ లలితాదేవికి కూడా ఆయనమీద పగా, ద్వేషం,కోపమూ వున్నాయి. ఆమెగారు కూడా ఆయనమీద ప్రతీకారం తీర్చుకోవాలనే గట్టి పట్టుదలతో వుందిట, మరి ఆయనకు ఇలాంటి ఊహ ఎందుకు కలుగలేదో ఆశ్చర్యంగానే వుంది. తాను ఏ దృష్టితో లీలావతిమీద కసి తీర్చుకుందామనుకుంటున్నదో అదే దృష్టితో లలితాదేవికూడా ఆయనమీద పగతీర్చుకోవాలనుకుంటోంది. ఆనాడు ఆయనగారు పెళ్ళిచూపులకని వెళ్ళి లలితాదేవి బాగాలేదని వచ్చేశార్ట. ఆయనగారుచూసి లలితాదేవికి వంక పెట్టాల్సిన అవసరం ఏమీలేదు. అందం అంటారా అది చూసే వాళ్ల కళ్ళల్లో వుంటుంది. మనం మన కళ్లతోనే చూడ కలుగుతాం. మనకు కనిపించినట్టుగానే అన్నీ వస్తువులు అందరికి ఒకే విధంగా కనిపిస్తాయనుకోవటం భ్రమ. ఆ య న దృష్టిలో ఆమె ఆనలేదేమో.అంతమాత్రం చేత ఆ లలితాదేవికి యేం లోపంవచ్చిందని ఈనాడుకూడా అది గుర్తుంచుకుని పెద్ద ప్రతీకారం అంటూ కూర్చోవటానికి ? మనస్తత్వాలు అర్థంకావు. మధ్య నలిగి బలయ్యేది నేను.

ఆయనగారు యింటికి పోలీసుల్ని తీసుకొచ్చేదాక నాకు ఏ విషయం తెలియనే తెలియదు. బిత్తరపోయాను, నివ్వెరపోయి చూశాను.వారు నా మొహం వేపు చూడనేలేదు. చూడలేకపోయారనుకుంటాను. చూసే ధైర్యం లేదేమో. అంతపిరికితనం యెందుకు? తప్పుచేసిన వాడు ప్రతివాడు పిరికివాడే. ధైర్యవంతులు యెన్నడూ తప్పు చేయరేమో. లీలావతి నిర్ఘాంతపోయి చూస్తోంది.ఈమే నెక్లెస్ కాజేసింది. మా ఇంట్లో వంటకని చేరి ఇల్లు గుల్లచేసి, మా యిద్దరి మధ్య పొరపులు పెట్టి చివరకు దొంగ

తనానికి కూడా సాహసించింది. వారు ఉద్రేకంలో ఏమంటున్నారో నేనేమి వింటున్నానో నాకే తెలియదు. కాని చాలా కర్ణకఠోరంగా వున్నాయి. లీలావతి దొంగతనం చెయ్యటమా? నా ఒళ్లు జలదరించింది. పోలీసులు రెండడుగులు ముందుకు వేశారు. లీలావతి ఏమీ మాట్లాడలేదు. వాళ్ళు గద్దించి అడుగుతున్నారు. ఆమె కదల్లేదు, మెదల్లేదు. లీలావతిదొంగకాదు. నెక్లెస్ ఆమె ఎత్తుకు పోలేదు. ఇదంతా ఒకనాటకం. ఇంకా ఏమేమిటో ఉద్రేకంగా అంటున్నా ననుకున్నానే గాని పైకి పెగిలిరావటంలేదు. నేనన్నమాటలు ఎవరికీ వినబడిఉండవు. ఆమెను పోలీసుస్టేషనుకు తీసుకుపోతారు. నేరం రుజువుఅయితే జైలుకు కూడా పంపిస్తారు. ఎందుకు రుజువు కాదు. రుజువు అవుతుంది. నేను బతికివుండగా లీలావతి జైలుకు వెళ్లటానికి వీల్లేదు. ఒక నేరస్తున్ని శిక్షించకపోవటం ఎంత అక్రమమో, ఒక నిర్దోషిని శిక్షించటం కూడా అంతకంటే అన్యాయమూ. దుర్మార్గమూనూ నేను చెయ్యబోతున్న పని వారి మనస్సుకు పూర్తిగా వ్యతిరేకమనితెలుసు. అయినా నేను చెయ్యక తప్పింది కాదు. ఇహ నేను నిశ్చయం చేసుకున్నాను. కాని అంతలోనే ఒక పెద్ద వింత జరిగిపోయింది. లీలావతి ముందుకు వచ్చి 'అవును నిజమే నేను దొంగతనం చేసిన మాట నిజమే. నా పెట్టెలో పెట్టాను నెక్లెస్. నేను బీదదాన్ని, డబ్బుకోసం ఇక్కడ వంటకు ఒప్పుకున్నాను. వీళ్లిచ్చే డబ్బు సరిపోక యీ పని చేశాను.' అని నిబ్బరంగా అన్నది. వారు మళ్ళీ తల యెత్తలేదు. నాకు ఆ క్షణంలో ఏం చేయాలో తోచలేదు. ఆయనను చాటుగా పిలిచి ఇది న్యాయమేనా అని అడుగుదామనుకున్నా. కాని ప్రయోజనం యేమీ వుండదని మెదలకుండా వూరుకున్నా. లీలావతి పోలీసుల వెనక బరువుగా తల వంచుకుని నడుస్తూవుంటే నేను కొయ్యబారిపోయాను. నిజం నాకు తెలిసినా రుజువుచెయ్యటం యెలా! తపన పడిపోయాను. నా మనస్సాగలేదు. చకచకా నేను వెనకాలే వెళ్ళాను. నన్ను ఆగిపొమ్మని చెప్పే ధైర్యం ఆయనకు లేకపోయింది. ఆయన యెదుటే అందరి యెదుటే నేను నిర్మొహమాటంగా అబద్ధం ఆడేశాను.'ఆ నెక్లెసు నేనే తీసుకున్నాను. లీలావతి పెట్టెలో పెట్టింది కూడా నేనే. ఆమె దొంగతనం చేసిందని మా వారికి నేనే చెప్పాను. తప్పంతా నాది. ఈమె మా ఇంట్లో ఇంక ఒక్క క్షణం వున్నా మా కాపురం నిలుస్తుందని తోచలేదు. అందుకనే ఇలాంటి పని చేశాను' అని నిర్మొహమాటంగా చెప్పేశాను.

లీలావతి త్రుళ్ళిపడ్డట్టయింది. ఆమె మీద నాకు అలాంటి అభిప్రాయం లేదని ఆమెకు బాగా తెలుసు. నేను ఎందుకు అబద్ధం ఆడానోకూడా తెలుసు. వారి

ప్రతీకారానికి బలయిపోదామనుకుందిగాని నేను చెప్పింది అబద్ధం అని వాదించే స్తోమత ఆమెలోలేదు. నే నన్నమాట కాదని వాదించే ధైర్యం ఆయనలోనూ లేదు. నేను చెప్పింది పూర్తిగా అతికిపోయింది. ఎవరెన్ని విధాల అనుకున్నా నేను చెప్పిందే సబబని అందరికీ తోచింది. ఆ విధంగా లీలావతి మా యింట్లోంచి వెళ్ళిపోయింది.

అయితే ఇహ మిగిలిందల్లా లలిత క్రోధము, అహంకారమూను. ఆమె వాలకము చూస్తూంటేనే భయమేస్తోంది. ఆమెలో చెలరేగిన పగ, ప్రతీకారం విన్నప్పటినుంచి నాకు ఒంట్లోంచి అదురు పుట్టుకొస్తోంది. ఆడది దేనికయినా తెగబడుతూంది. ఏం చేస్తూందో యేమో అనుకుంటూనేవున్నా. పాపం రామనాథం గోవులాంటివాడు. ఆమెగారు యెంత చెపితే అంతే. ఇంట్లోనూ అంతే, బయటా అంతే ! భార్యాభర్తల మధ్య ఏ రకమైన ఘర్షణలు జరిగినా యేమీ బయటికి పొక్కటం లేదు. కాని ఆయన్నీ కొంపకు వెళ్ళమని చెప్పినప్పటి నుంచి నా మనస్సు మనస్సులోలేదు. మీ రిప్పుడు వెళ్లద్దని గట్టిగా ఆయనతో అన్నాను. ఇవ్వాళగాకపోతే రేపయినా వెళ్ళొద్దూ అని మామూలుగా అనేశారు కాని ఏదో నా మనస్సు చెపుతోంది, వద్దని వాదించలేకపోయాను.

ఆ నాడు సాయంత్రం రైలుస్టేషనుకు నేనూ వెళ్ళాను. ఆయన రైల్లో ఎక్కటం చూశాను. రైలు కనిపించనంతవరకు ప్లాటుఫారం మీదే నిలబడి వున్నాను. నా కళ్లల్లో అప్రయత్నంగా నీళ్లు తిరిగాయి. రామనాథంగారి చెయ్యి పట్టుకుని గబగబా కారుదాకా తీసుకుపోయిన లలిత మొహంలోకి క్షణకాలం చూశాను. మరింత వణుకొచ్చేసింది. అదిరిపడిపోయాను. ఆ సమయంలో ఆమెగార్ని ప్రాధేయపడి బతిమాలుదామనుకున్నాను. దేనికోసం ఏమిటని. అనిర్వచనీయమైన ఆవేదన ఆరాటం నా మనస్సు చుట్టేసినాయి. ఉక్కిరిబిక్కిరయిపోయాను. నిలబడలేకపోయాను. తూలినట్టయిపోయింది. ప్రక్కస్తంభం ఆసరా చేసుకుని రొప్పుతూ అతి బలవంతంమీద నిలబడ్డాను. ఇక ఒక్క అడుగు ముందుకు సాగలేకపోయాను. సత్తువలేని కాళ్లను యీడ్చుకుంటూ అతి కష్టంమీద ప్లాటుఫారందాటి ఇంటికివచ్చేశాను. ఆ రాత్రంతా కంటిమీద కునుకు లేదు. కళ్ళుమూస్తే చాలు ఆయన వచ్చేసి యేదో చెపుతున్నట్లు అనిపించేది. చప్పున కళ్ళు తెరిచి మంచంమీద కూర్చునేదాన్ని. అలసటగా అటూ ఇటూ పచార్లు చేస్తుంటే మనస్సు పరిపరి విధాల పోతోంది ఆ క్షణాన అమాంతం లలితాదేవి దగ్గరకు వెళ్ళి ఆయన్ని ఏంచేశావు అనడగాలనిపించేది. మళ్ళీ తమాయించుకున్నాను. ఆ రాత్రి గడిచినట్టే ఇంకా




అయిదు రాత్రుళ్ళు గడిచిపోయినాయి. ఆయనగారు ఇంటికి రావాల్సిన గడువు దాటి ఒకరోజు గడిచిపోయింది. ఆఫీసుకు, రామనాథం ఇంటికి పిచ్చిదాని లాగ తిరగటం మొదలుపెట్టాను. ఎవ్వరూ సమాధానం చెప్పటంలేదు. ఎవ్వరూ పలకటం లేదు. పోలీసుస్టేషనుకు వెళ్ళి రిపోర్టు చేశాను. వాళ్ళు ఆచూకీ చూస్తారు.

ఈ లోగా రకరకాల వార్తలు, వదంతులు బయలుదేరుతున్నాయి. ఆయనగారు డబ్బు తీసుకొస్తుంటే ఎవరయినా దుండగులు డబ్బుకోసం ఆయన్ని హత్య చేసి వుండచ్చు. అంత డబ్బు చేతికి చిక్కిన తర్వాత తానే పరారయి వుండవచ్చు. ఏదైనా యాక్సిడెంటు అయిందేమోతలొ కరకరకంగా అనుకుంటున్నారు.

నాకయితే ఏదో గుడ్డి ధైర్యం, ఆయనకేం, జీవించేవున్నారు. ఎక్కడోమరి. ఎప్పుడో ఒకప్పుడు వచ్చేసి లలితాదేవి కుట్ర బయటపెట్టక మానరు. అయితే ఈలోగా మీకెవరికయినా కనిపిస్తే మాత్రం నాకు కబురు చెయ్యండి. భారీ మనిషి, నలుపు, పెద్దపెద్ద కళ్లు, యెడం చెయ్యిమీద పెద్ద మచ్చ పాంట్, బుష్షర్టు వేసుకుంటారు. ఆయనే మావారు.

అవులే నేనూ ప్రతీకారం తీర్చుకుంటాను. యీ విధంగా కాదు. ఇంత నీచంగానూ, దారుణంగానూ కాదు. నాకు జరిగిన అన్యాయం అంతా కడిగి పెడుతూ నవల రాస్తాను. అంతకంటే నేను చెయ్యగలిగిన ప్రతీకారం ఏముంటుంది. !